క్లుప్తంగా

ఆకొండి వెంకట్రావుకు సత్కారం



ఆకొండి వెంకట్రావును సత్కరిస్తున్న సంగీత సంస్థల ప్రతినిధులు

అల్లిపురం : సంగీత జనకులం ద్వారా 23 సంవత్సరాలకు పైగా శాస్త్రీయ సంగీత వైభవానికి తన వంతు నిస్వార్థ సేవలందిస్తున్న ఆకొండి వెంకట్రావును శనివారం ఘనంగా సత్కరించారు. జిల్లా కోర్టు దరి ఐవీఎల్ శాస్త్రి సంగీత కళా సమితి కార్యాలయ ప్రాంగణంలో శృతిలయ, మెలోడీ క్రియేటర్స్, రసరాగ మాధురి సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా ఒక్క విశాఖ జిల్లాలోనే కాకుండా జిల్లాయేతర ప్రాంతాల్లో కూడా ఉచితంగా సంగీత శిక్షణ ఇస్తున్న ఆకొండి వెంకట్రావును, ప్రముఖ న్యాయవాది, ఎంబర్‌మన్నార్ దేవస్థానం మాజీ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, వి.ప్రభాకర్, సీహెచ్ సత్యనారాయణ, ఎంఎస్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ

అల్లిపురం : బంగారుమెట్ట జీవీఎంసీ అల్లిపురం న్యూ స్కూల్లో శనివారం విద్యార్థులకు కిట్లను వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి అందజేశారు. ఈ కిట్లలో విద్యార్థులకు కావాల్సిన స్కూల్ బ్యాగులు, యూనిఫారాలు, పాఠ్య పుస్తకాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పుస్తకాలను, సౌకర్యాలను విద్యార్థులు చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.అరుణలక్ష్మి, స్కూల్ హెచ్‌ఎంబీ వినోద్‌కుమార్, ఎస్‌జీటీ భీశెట్టి గోపీకృష్ణ, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

జూలై 27న అఆ ఫౌండేషన్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్



మాట్లాడుతున్న బైపా అరుణ్‌కుమార్

అల్లిపురం : అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ (అఆ) 17వ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జూలై 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బాబ్ కౌన్సిల్ సభ్యుడు, ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ బైపా అరుణ్ కుమార్, ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పినిపే వెంకట రామకృష్ణ తెలిపారు. బీపీకే చాంబర్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వర్క్‌షాప్ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో రాజకీయాలకు అతీతంగా న్యాయవాదులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాగుపల్లి చిన్నారావు, బొంటు కృష్ణారావు, పి.చలపతి, నాగకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్త శక్తుల సమాహారం మహాకాళి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురుదేవుల ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం త్రిశక్తి వైభవంపై శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని ప్రవచనం చేశారు. దేవీ భాగవతం, కాళీ పురాణంలో అమ్మవారి వైభవ విశేషాలు ఉన్నాయని తెలిపారు. కాళీ రూపంలో అమ్మవారు పరమేశ్వరుడికి ప్రియమైన స్వరూపమని, శివశక్తి అభేద్యమని, కాళీమాత వాక్శక్తినిచ్చే దేవతని, సమస్త శక్తుల సమాహారమైన మహాకాళి అని కాళీతత్వాన్ని వివరించారు. మాత అలంకారాలను, ఆయుధాలను, శక్తులను, విశిష్టతను వివరించారు. కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ఈ ప్రవచన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

- నీటి సరఫరా లేక వినియోగానికి దూరం
- అందుబాటులోకి తీసుకురావాలని స్థానికుల వినతి



ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

జగదాంబ : నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డు ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం వన్ వే రహదారిలో గతంలో ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించారు. అప్పట్లో ఇది బాగానే నిర్వహించటంతో ప్రజలు చక్కగా వినియోగించుకునేవారు. మార్కెట్ వచ్చే వారికి ఇది అనుకూలంగా ఉండేది. వీటి నిర్వహణకు సరిపడినంతగా నీటి సరఫరా జరిగేది. ఈ విషయంలో జీవీఎంసీ అధికారులు అవసరమైన చర్యలు తీసుకున్నారు. అయితే తర్వాతి కాలంలో మాత్రం ఇక్కడి మరుగుదొడ్ల నిర్వహణను గాలికొదిలేశారు. నీటి సరఫరా కూడా లేకుండా పోయింది. దాంతో ఈ మరుగుదొడ్ల వినియోగం ఆగిపోయింది. దీంతో మార్కెట్‌కు వచ్చే వారు బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారు. ఈ కారణంగా చుట్టుపక్కల ప్రాంతాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయని, దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్నది వర్షా కాలం కావటంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని భయపడుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటి సరఫరా చేసి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరూ..



స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన హార్బర్ పోలీస్ స్టేషన్ ఏరియా

జగదాంబ : స్పీడ్ బ్రేకర్లు లేక హార్బర్ పోలీస్ స్టేషన్ సమీపంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని రామకృష్ణా జంక్షన్ ప్రజలు చెబుతున్నారు. జీవీఎంసీ 35, 33, 41 వార్డుల గుండా రామకృష్ణా జంక్షన్, కొబ్బరితోట, జ్ఞానాపురం వెళ్లేందుకు ఒక రహదారి ఉంది. పలు ప్రాంతాలకు ఇదే ప్రధాన రహదారి కావటంతో ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటుంది. అంతే కాకుండా పోర్టు రైల్వే ట్రాక్ కూడా ఈ జంక్షన్ మీదుగానే వెళ్తుంది. దీంతో ఈ ప్రాంతంలో రద్దీతో పాటు ట్రాఫిక్ అంతరాయం కూడా ఏర్పడుతుంటుంది. ఇక్కడ గతంలో ప్లాస్టిక్, ఫైబర్‌తో కూడిన స్పీడ్ బ్రేకర్లు ఉండేవి. అయితే వాహనాల రాకపోకల కారణంగా అవి శిథిలమైపోయాయి. తారురోడ్డు కూడా పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని అరికట్టేందుకు అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికులు, పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించాలని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతి



జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

అల్లిపురం : ఊర్వశీ జంక్షన్ సమీపంలో గల కప్పరాడ ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ ఎదుట గల సర్వీస్ రోడ్డులో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని హాస్టల్ విద్యార్థులు, ఏఐడీఎస్‌వో విద్యార్థి సంఘం ప్రతినిధులు జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు వీధి దీపాలు లేకపోవటంతో విద్యార్థులకు భద్రత, రక్షణ లేకుండా పోయాయన్నారు. ఈ మధ్య కొన్ని రౌడీమూకలు చీకటి పడిన తర్వాత హాస్టల్‌కు వచ్చే దారిలో కాపుకాచి ఒంటరిగా వస్తున్న విద్యార్థులపై దాడులు చేస్తున్నారని ఏసీ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే సర్వీస్ రోడ్డులో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

విదేశాల్లో మాస్టర్ సి.వి.వి. మే కాల్ డే ఉత్సవాలు



లాస్ క్రూసెస్ నగరంలో అగ్నిహోత్ర క్రతువు నిర్వహిస్తున్న సత్యదేవ్



స్పెయిన్‌లో సాధక బృందంతో గురుప్రసాద్

తాటిచెట్లపాలెం: లోకహితార్థం జీవించిన పరమ గురువుల బోధనలు, వారు చూపిన మార్గం నేడు భౌగోళికంగా వ్యాప్తి చెందాయని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. మాస్టర్ సి.వి.వి. తన యోగ మార్గాన్ని ఉపదేశించిన మే 29న ప్రతీ ఏటా మే కాల్ డేగా పాటిస్తారు. 1910లో ప్రప్రథమంగా కుంభకోణంలో మాస్టర్ సి.వి.వి. మే కాల్ డేను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యదేవ్ ఇటీవల యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో నిర్వహించిన తన 4వ యాత్రను ముగించుకుని నగరానికి చేరుకున్నారు. మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో శనివారం పలు విషయాలను ఆయన వెల్లడించారు. అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్రంలో గల లాస్ క్రూసెస్, థావోస్, డల్లాస్ నగరాల్లో మే కాల్ డే సందర్భంగా ఉత్సవాలు, సత్సంగాలు, పూజాది క్రతువులను జరిపామని చెప్పారు. మాస్టర్ సి.వి.వి. ప్రార్థన, యోగ మార్గంపై విదేశీయులు ఆసక్తి చూపుతున్నారని, మాస్టర్ ఇ.కె.రచనలు వారికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మాస్టర్ ఇ.కె., మాస్టర్ పార్వతీకుమార్‌లు రాసిన అనేక గ్రంథాలు జర్మనీ, స్పెయిన్ దేశాల్లో వారి వారి భాషల్లో అనువాదమై, పాశ్చాత్యుల ఆధ్యాత్మిక సాధనకు ఉపయోగపడుతున్నాయని వివరించారు. ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయానికి నాడు మాస్టర్ ఇ.కె., మాస్టర్ పార్వతీకుమార్‌లు చేసిన విదేశీయాత్రలు నేడు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. ట్రస్ట్ భౌగోళిక అధ్యక్షుడు కె.చంద్రశేఖర గురుప్రసాద్ ఇటీవల స్పెయిన్, జర్మనీ దేశాల్లో 15 రోజులు పర్యటించి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. మాస్టర్ సి.వి.వి. 115వ మే కాల్ డేను నిర్వహించారని, ఆయా దేశాల్లో అగ్నిహోత్రాది క్రతువులను కూడా నిర్వహించినట్లు సత్యదేవ్ చెప్పారు.

జగన్నాథస్వామికి జ్యేష్ఠాభిషేకం



జగన్నాథస్వామికి అభిషేకం చేస్తున్న ఈవో రాజగోపాల్‌రెడ్డి

అల్లిపురం: టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానంలో శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని జ్యేష్ఠాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి, మూల విరాట్టుకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. పూజల అనంతరం రెండు వారాల పాటు స్వామి వారికి ఉక్కలో పెట్టి తలుపులు వేశారు. మరల తిరిగి జూలై 7వ తేదీన నేత్రోత్సవం కార్యక్రమం నిర్వహించి భక్తులకు స్వామి వారి దర్శనాలు కల్పించనున్నట్లు ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణం

భారీగా పాల్గొన్న శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామి భక్తులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



విశేష అలంకరణలో స్వామి వారు

అల్లిపురం : టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు భార్గవశర్మ శైవాగమన సంప్రదాయంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్యాణోత్సవంలో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను అస్సాంగార్డెన్స్, టూటౌన్ రోడ్డు, డాబాగార్డెన్స్, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం తదితర ప్రాంతాల్లో తిరువీధి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్కాజోస్యుల రమేష్ శర్మ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ సిబ్బంది మన్మథరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



డ్రైఫ్రూట్స్‌తో అలంకరించిన చంద్రమౌళీశ్వరస్వామి



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

వ్యాధుల వివరాల నమోదు తప్పనిసరి

డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూలకు సంబంధించిన రిపోర్టులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి జిల్లా మలేరియా అధికారిని సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శనివారం తన కార్యాలయంలో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం అనంతరం జిల్లాలో 'స్టాప్ డయేరియా' ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. ఐఆర్‌ఏడీ యాప్ అప్‌లోడ్ గురించి తెలిపారు. అంతే కాకుండా పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్, ఫారం-ఎఫ్ అప్‌లోడింగ్, రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ తదితర వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని ఆస్పత్రులు రెన్యువల్స్, రిజిస్ట్రేషన్స్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఫారం-ఎఫ్ ఆన్‌లైన్‌లో విధిగా అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా సాధారణ కాన్పులు చేయాలని, సాధ్యమైనంత వరకు సి-సెక్షన్ ప్రసవాలు తగ్గించాలని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తులసీరాజ్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వ్యాధులకు సంబంధించిన రిపోర్టులు తెలియజేసేటప్పుడు రోగుల ఆధార్ కార్డు, ఇతర వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. దాని వలన రోగిని సులభంగా గుర్తించి మెరుగైన వైద్య సేవలందించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ జగదీష్ ప్రసాద్, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, ఐఆర్‌ఏడీ మెడికల్ అధికారి డాక్టర్ ఎ.యామినీకాంతి, జిల్లా గణాంక అధికారి మురళీకృష్ణ, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వేంకటేశ్వరుడికి పౌర్ణమి పూజలు

కంచరపాలెం: గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ, అర్చకులు శర్మ నేతృత్వంలో వెంకన్నకు సుప్రభాత సేవ, చక్రస్నానం చేశారు. వేకువజాము 6 గంటలకు శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, కమిటీ సభ్యులు పంచామృతాభిషేకాలు, తులసీమాలార్చన నిర్వహించారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు

ఆరిలోవ: మాదక ద్రవ్యాల వాడకంతో యువత తప్పుదోవ పడుతోందని ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు తెలిపారు. తోటగరువు దరి ఎర్ని దుర్గమాంబ ఆలయ ప్రాంగణంలో శనివారం స్థానిక ఆటో డ్రైవర్లు, సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి మత్తు పదార్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరిలోవలో అన్ని రకాల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. నమోదు అవుతున్న ప్రతి నేరంలోను ఆరిలోవ ప్రాంతానికి చెందిన వ్యక్తులు ఉంటున్నారన్నారు. దీంతో పాటు ఈ ప్రాంతంలో మాదక ద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా జరుగుతోందని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం పాడవడంతో పాటు బంగారు భవిష్యత్ నాశనమవుతుందని తెలిపారు. ఇంట్లో పిల్లలు మత్తు పదార్థాలు, సెల్ ఫోన్లకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలన్నారు. ఈ విషయంలో స్థానికులు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు సూచనలు..

ఆటోలు ఎక్కే పాసింజర్ల మూటలను ఆటో డ్రైవర్లు గమనించాలని ఏసీపీ సూచించారు. గంజాయితో ఆటో ఎక్కేవారి ఆచూకీ పోలీసులకు తెలియజేస్తే తెలిపిన వారికి పారితోషికం అందించి సత్కరిస్తామన్నారు. ఆటో డ్రైవర్లు ప్రమాదాలకు కారకులు కాకుండా సక్రమంగా వ్యవహరించాలన్నారు. అనంతరం 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు మాట్లాడుతూ ఆరిలోవలో గంజాయి బ్యాచ్‌లను నిర్మూలించాలని పోలీసులను కోరారు. పోలీసులకు తాము సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరిలోవ సీఐ జి.గోవిందరావు, పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు



రమా సహిత సత్యనారాయణ స్వామి

డాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువజాము 2 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులుదీరారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు ప్రత్యేక టికెట్లు అందుబాటులో ఉంచారు. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా చక్రస్నానం..

అల్లిపురం : ఇసుకకొండపై వెలసిన శ్రీ రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా శనివారం దేవస్థానం ప్రధాన అర్చకులు ఫణిహారం నరసింహమూర్తి ఆధ్వర్యంలో రుత్విక్కుల సహకారంతో పూర్ణాహుతి, ధ్వజావరోహణం, చక్రస్నానం, అవభృదం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా భీమిలి శాసన సభ్యుడు గంటా శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు పుష్పయాగం..

శ్రీ రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారి పుష్పయాగం అనంతరం పవళింపు సేవ నిర్వహించనున్నట్లు ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. పవళింపు సేవతో కల్యాణ వేడుకలు ముగుస్తాయని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మద్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అజయ్‌శంకర్ (36) అనే వ్యక్తి జ్ఞానాపురంలో ఒంటరిగా నివసిస్తున్నాడు. పూర్ణా మార్కెట్‌లో ఓ బంగారం వ్యాపారి వద్ద కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి భార్య ఉంది. ఈ దంపతుల మధ్య విభేదాల వల్ల ఆమె నర్సీపట్నంలో తన తల్లి దగ్గర ఉంటోంది. ఈ నెల 20 నుంచి అజయ్‌శంకర్ ఇంట్లోనే ఉన్నాడు. రెండు రోజులుగా తలుపులు తెరవడం లేదని కిటికీ నుంచి ఆ ఇంటి యజమాని చూడగా.. మంచంపై పడి ఉన్నాడు. దీంతో అతడి భార్యకు యజమాని సమాచారం అందించడంతో ఆమె వచ్చింది. అనంతరం మృతుడి తండ్రికి సమాచారం అందించారు. అతడి తండ్రి సోమేశ్వరరావు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు ఎవరితోనూ ఎటువంటి ఇబ్బందులు లేవని, బతకాలని లేదని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్‌ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి ఆదివారం పోస్ట్‌మార్టం చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు. భార్యతో విభేదాల కారణంగా అజయ్‌శంకర్ మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

యోగాతో ఆరోగ్య సమస్యల పరిష్కారం



యోగ సాధన చేస్తున్న పాస్‌పోర్ట్ అధికారి విశ్వాంజలి ఎం.గైక్వాడ్, సిబ్బంది

మురళీనగర్: యోగ సాధనతో రోజువారీ ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని విశాఖపట్నం ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి విశ్వాంజలి ఎం.గైక్వాడ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం మద్రిపాలెంలోని రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయంలో యోగా సాధనపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరిలో ఒత్తిడి పెరిగిందన్నారు. గాడ్జెట్-ఇంటెన్సివ్ జీవనంలో మనిషి జీవితంలో ఏర్పడుతున్న సమస్యలను యోగా సాధన ద్వారా పరిష్కరించుకోవచ్చని వివరించారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి, నిరంతరం చైతన్యవంతంగా ఉండడానికి యోగా చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. యోగా టీచర్ కేవీఎస్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. సిబ్బంది సందేహాలను ఆయన నివృత్తి చేశారు. నృత్యాంజలి స్పిరిట్ ఆఫ్ ఆర్ట్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులకు విశ్వాంజలి ప్రశంసాపత్రాలు అందించారు.